



నేటి దినపత్రిక


# సూర్య

www.suryaa.com

ఆదిలాబాద్

మంచిర్యాల
నిర్మల్ - కొమరం భీం
ఆసిఫాబాద్

బుధవారం 25 ఫిబ్రవరి 2026 పేజీలు 07

వార్షిక పరీక్షల నిర్వహణ

## పకడ్బందీగా చేపట్టాలి

**- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు**




**మంచిర్యాల ప్రతినిధి,సూర్య మేజర్ న్యూస్ :**

10వ తరగతి, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుండి అదనపు డి జి పి మహేష్ భగవత్, అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పంచాయతీ, విద్య, వైద్య, పోలీస్, మున్సిపల్, విద్యుత్, రవాణా శాఖల అధికారులు, సంబంధిత అధికారులతో వార్షిక పరీక్షల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ వార్షిక పరీక్షల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. ఈ నెల 25వ తేదీ నుండి మార్చి 16వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు, మార్చి 14 నుండి ఏప్రిల్ 16వ తేదీ వరకు 10వ తరగతి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పరీక్షల నిర్వహణలో భాగంగా ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను నియమించాలని, పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, పరీక్ష సమయంలో 163 బి.ఎన్.ఎస్.ఎస్. సెక్షన్ అమలు చేయడం జరుగుతుందని, పరీక్ష కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పరీక్ష సమయానికి అనుకూలంగా టి.జి.ఎస్.ఆర్.టి.సి. అధికారులు బస్సు సౌకర్యం కల్పించాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా అధికారులు పర్యవేక్షించాలని, ప్రతి పరీక్ష కేంద్రంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని, ప్రశ్నా, జవాబు పత్రాల సురక్షిత రవాణా కొరకు తపాలా శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. పరీక్ష ప్రశ్న పత్రాలు తెరిచే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, ప్రశ్నపత్రాల రవాణాలో పోలీస్ అధికారుల సమన్వయంతో రక్షణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. పరీక్ష కేంద్రంలో సిబ్బంది, సి సి కెమెరాలు, త్రాగునీరు, మూత్రశాలలు, వెలుతురు సరిపడా ఉండేలా చూసుకోవాలని, ఫర్నిచర్ పరిశీలించుకోవాలని తెలిపారు. పరీక్ష కేంద్రంలోనికి మొబైల్ లను అనుమతించడం జరగదని తెలిపారు. క్లాక్ రూమ్, కంట్రోల్ రూమ్ నిర్వహణ సక్రమంగా చేపట్టాలని తెలిపారు. ప్రీ ఫైనల్ పరీక్షలు ముగిసిన తర్వాత ఉపాధ్యాయులు వార్షిక పరీక్షలకు అందుబాటులో ఉండాలని తెలిపారు. అల్పాహారం పథకం క్రింద సెంట్రాలైజ్డ్ కిచెన్ ఏర్పాటు కొరకు 21 జిల్లాల నుండి భూ వివరాలు అందించడం జరిగిందని, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల పనుల పురోగతిపై సమీక్షించారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలలో భోజన శాలల పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.అదనపు డి జి పి మాట్లాడుతూ పరీక్ష కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్ ల వద్ద బందోబస్తు పకడ్బందీగా నిర్వహించాలని, పరీక్ష సమయంలో జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచాలని తెలిపారు. రాష్ట్ర సరిహద్దులలో గల పరీక్ష కేంద్రాల వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.


జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలో పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ కొరకు జిల్లాలో 23 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రథమ సంవత్సరంలో జనరల్ 5 వేల 372 మంది, ఒకేషనల్ 888 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరంలో జనరల్ 5 వేల 227 మంది, ఒకేషనల్ 830 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారని తెలిపారు. 10వ తరగతి పరీక్షల కొరకు జిల్లాలో 48 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, 9 వేల 703 మంది రెగ్యులర్, 45 మంది ఒక్కసారి అనుత్తీర్ణులైన విద్యార్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు. పరీక్షల సమయంలో విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, విద్యార్థినీ, విద్యార్థులు పరీక్ష నిబంధనలను పాటించేలా అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో వార్షిక పరీక్షలు విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి.చంద్రయ్య, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి అంజయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి, ఎస్.యాదయ్య, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

---

## ఇంటర్,10వ, తరగతి వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

**- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి. రామకృష్ణ రావు**

**ఆసిఫాబాద్ ప్రతినిధి,సూర్య మేజర్ న్యూస్ :**




24 ఇంటర్, 10వ, తరగతి వార్షిక పరీక్షలను పకడ్భందీగా నిర్వహించాలని, రాష్ట ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రామకృష్ణరావు అన్నారు. మంగళవారం రాష్ట సచివాలయం నుండి ఇంటర్ 10వ. తరగతి పరిక్షల నిర్వహణపై అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పిలు,విద్యాశాఖ అధికారులు, వైద్యశాఖ అధికారులు,ఆర్టిసి అధికారులు, విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమానికి కార్యదర్శులు, కమిషనర్లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఈ నెల 25 నుండి మార్చి 18 వరకు ఇంటర్ ప్రథమ, ద్వితీయ పరిక్షలు వుంటాయని, 10వ. తరగతి వార్షిక పరిక్షలు, మార్చి 14 నుండి ఏప్రిల్ 16 వరకు ఉంటాయని, ప్రతి పరిక్ష కేంద్రంలో త్రాగునీరు, పారిశుద్యం, వెలుతురు, సరిపడా పర్నిచర్ వుండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరిక్ష కేంద్రం వద్ద మెడికల్ క్యాంపు, పోలీస్ బందోబస్తు, ప్రశ్న ,జవాబు పత్రాలను పోలీస్ బందోబస్తు మద్య పరిక్ష కేంద్రాలకు తరలించాలన్నారు.విద్యార్ధులు పరిక్ష సమయానికి చేరుకునేలా, ఆర్టిసి అధికారులు బస్సులు నడపాలన్నారు. సమీకృత కలెక్ట రేట్ భవనంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కు కలెక్టర్ కె. హరిత హాజరైయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇంటర్ పరిక్షల నిర్వహణకు 19 పరిక్షా కేంద్రాలు 10వ. తరగతి వార్షిక పరిక్షల నిర్వహణకు 38పరిక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని పరిక్షలను పకడ్భందిగా, ప్రశాంతంగా, జరిగేల చర్యలు తీసుకుంటున్నామన్నారు. ( మిగితా.... 2లో )

---

## గ్రామస్థాయి పరిపాలనలో జిపిఓల పాత్ర కీలకం

**- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య**

**మంచిర్యాల,ఏప్రిల్ 24, సూర్య మేజర్ న్యూస్ :**

ప్రభుత్వ పథకాలను సమర్ధవంతంగా అమలు చేస్తూ గ్రామస్థాయి పరిపాలనలో జిపిఓల పాత్ర కీలకమైనదని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)



పి. చంద్రయ్య అన్నారు.మంగళవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భావన సమావేశ మందిరంలో జిపిఓ/ఆర్ ఐ యాప్ పై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి తహసిల్దార్ మల్లికార్జున్, ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ సునీల్‌లతో కలిసి హాజరయ్యారు. ( మిగితా...2లో )

---

ఇంటర్ పరిక్షల నిర్వహణకు

## పూర్తి స్థాయీ ఏర్పాట్లు

**- జిల్లా కలెక్టర్ కె. హరిత**

**ఆసిఫాబాద్,సూర్య మేజర్ న్యూస్ :**

24 ఇంటర్ పరిక్షల నిర్వహణకు పూర్తి స్థాయీ ఏర్పాట్లు జిల్లాలో ఇంటర్మిడియట్, ప్రథమ ద్వితీయ పరిక్షల నిర్వహణకు పూర్తి స్థాయీ ఏర్పాట్లు చేయడం జరిగిందని కలెక్టర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 25 నుండి మార్చి 18 వరకు ఇంటర్, ప్రథమ, ద్వితీయ సవత్సరం పరిక్షలు ఉదయం 9గం. నుండి మద్యాహ్నం 12గం.వరకు ఉంటాయని తెలిపారు. ఇంటర్ పరిక్షల కొరకు 19 పరిక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని ఇంటర్ ప్రథమ, ద్వితీయ ఒకేషనల్ కోర్సుకు చెందిన 9716. మంది విద్యార్ధులు పరిక్షలకు కేంద్రంలో త్రాగునీరు,పారిశుద్యం,సరిపడ పర్నిచర్, వెలుతురు,ఫ్యాన్లు,విద్యుత్ సరఫరా వుండేలా చర్యలు




తీసుకుంటున్నామన్నారు.

మిగితా... 2లో

---

## ఎయిర్‌పోర్ట్ మాస్టర్ ప్లాన్‌ను పరిశీలించిన ఎంపీ, ఎమ్మెల్యే

**ఆదిలాబాద్,మేజర్ సూర్య న్యూస్:**



జిల్లా కేంద్రంలోని ఏరోడ్రోమ్ ప్రాంతంలో ఎయిర్‌పోర్ట్ మాస్టర్ ప్లాన్‌ను ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ కలిసి మంగళవారం పరిశీలించారు. మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా ఎంత భూమి అవసరం అవుతుందో, ఎన్ని ఎకరాలు ఏ ప్రాంతాల వరకు సేకరించాల్సి ఉంటుందనే అంశాలను మ్యాప్ ఆధారంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అమలులో పారదర్శకత పాటిస్తూ, స్థానిక ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా భూసేకరణ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని అధికారులకు సూచించారు. ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుతో ఆదిలాబాద్ ప్రాంత అభివృద్ధికి కొత్త దారులు తెరుచుకుంటాయని పేర్కొన్నారు. వారి వెంట బీజేపీ కౌన్సిలర్ ధోని జ్యోతి, దయాకర్ చారి, ముకుంద, తాటి పెల్లి గంగాధర్ రావు, కనపర్తి చంద్రకాంత్ తదితరులు ఉన్నారు.


# త్వరిత గతినా విమానాశ్రయ పనులు పూర్తిచేయాలి

## - జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్ ప్రతినిధి, సూర్య మేజర్ న్యూస్**



జిల్లా కేంద్రంలో విమానాశ్రయ ఏర్పాటుతో ఈ ప్రాంత రూపురేఖలు పూర్తిగా మారిపోతాయని, పట్టణ విస్తీర్ణంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆదిలాబాద్ విమానాశ్రయం డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్‌పై ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే



పాయల్ శంకర్‌లతో కలిసి ఆయన సంబంధిత శాఖల అధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విమానాశ్రయ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రధానంగా రన్ వే విస్తరణకు సంబంధించి రహదారుల మళ్లింపు, విద్యుత్ లైన్ల తరలింపు వంటి అంశాలపై ఆర్‌అండ్‌బీ, విద్యుత్, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

భూసేకరణలో భాగంగా ప్రభావితమయ్యే వ్యవసాయ భూములకు సంబంధించి పూర్తి స్థాయి అంచనాలతో కూడిన నివేదికలను తక్షణమే సిద్ధం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, ప్రాజెక్టు ఆలస్యం కాకుండా ప్రతి అడుగులోనూ పారదర్శకత పాటించాలని అధికారులను కోరారు. ఎంపీ గోడం నగేష్ మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో విమానాశ్రయ పనుల్లో నెలకొన్న సాంకేతిక అడ్డంకులను తొలగించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన అనుమతులు, నిధుల విషయంలో తాము నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, త్వరలోనే క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సరిహద్దు జిల్లా అయిన ఆదిలాబాద్‌కు ఈ విమానాశ్రయం ఒక వరంలా మారుతుందని అన్నారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ, విమానాశ్రయం రాకతో ఆదిలాబాద్ జిల్లా పారిశ్రామికంగా, ఆర్థికంగా అద్భుతమైన వృద్ధిని సాధిస్తుందని పేర్కొన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఈ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రస్తుత ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. ఎయిర్‌పోర్ట్ అందుబాటులోకి వస్తే రవాణా సౌకర్యాలు మెరుగుపడటమే కాకుండా, కొత్త పరిశ్రమలు వచ్చే అవకాశం ఉంటుందని, దీని ద్వారా స్థానిక యువతకు ఉపాధి మార్గాలు మెరుగవుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్లు శ్యామలాదేవి, రాజేశ్వర్, ఆర్డీఓ స్రవంతి, వివిధ శాఖల ఉన్నతాధికారులు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### ముఖ్య ప్రణాళిక అధికారి కార్యాలయాన్ని అకస్మికంగా

## తనిఖీ చేసిన - జిల్లా కలెక్టర్ కె. హరిత

**ఆసిఫాబాద్,ఫిబ్రవరి24, సూర్య మేజర్ న్యూస్ :**

ముఖ్య ప్రణాళిక అధికారి కార్యాలయాన్నిఅకస్మికంగా తనిఖీ చేసిన మంగళవారం రోజున ఉదయం సమీకృత కలెక్ట రేట్ భవనంలోని ముఖ్య



ప్రణాళిక అధికారి కార్యలయాన్ని జిల్లా కలెక్టర్ కె. హరిత అకస్మికంగా తనిఖి చేసి సిబ్బంది హాజరు రిజిస్టరును పరిశీలించి కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులు సమయ పాలన పాటించారని ముఖ్య ప్రణాళిక అధికారిని అడిగి తెల్సుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సిబ్బంది సమయ పాలన పాటించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమములో ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

### జిల్లా వ్యవసాయశాఖ అధికారి వెంకటి ఆధ్వర్యంలో

## వ్యసాయ పనిముట్ల పంపిణి

**తిర్యాణి సూర్య మేజర్ న్యూస్**

తిర్యాణి మండల కేంద్రంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామపంచాయతీ రైతులకు వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేశారు



గంభీరావుపేట గోయగామా నాయకపు కూడా మంగి రైతులకు కల్టివేటర్, ఫ్లవు,స్ప్రేయర్, పరికరాలు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో మంగి సర్పంచ్ రాయిసిడం వినోద్ చేతుల మీదుగా కోట్నాక రాంషా అనే రైతుకు ట్రాక్టర్ కల్టివేటరు ఇప్పించారు ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకటి, తిర్యానీ వ్యవసాయ శాఖ అధికారి వినయ్ రెడ్డి పలువురు వ్యవసాయశాఖ అధికారులు పలువురు రైతులు పాల్గొన్నారు

### 10వ తరగతి వార్షిక పరీక్షలను

## పకడ్బంధీగా నిర్వహించాలి

### - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల,సూర్య మేజర్ న్యూస్ :** జిల్లాలో జరగనున్న 10వ తరగతి వార్షిక పరీక్షలను పకడ్బంధీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి.చంద్రయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.యాదయ్య లతో కలిసి మండల విద్యాధికారులు, ముఖ్య పర్యవేక్షకులు, శాఖ అధికారులు, రూట్ అధికారులతో వార్షిక పరీక్షల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మార్చి 14 నుండి ఏప్రిల్ 16వ తేదీ వరకు 10వ తరగతి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, ఇందు కొరకు జిల్లాలో 48 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. 9 వేల 703 మంది రెగ్యులర్, 45 మంది ఒక్కసారి అనుత్తీర్ణులైన విద్యార్థులు పరీక్ష రాయనున్నారని, పరీక్షల నిర్వహణలో భాగంగా ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను నియమించడం జరిగిందని తెలిపారు. పరీక్ష రోజున పోలీస్ స్టేషన్ నుండి పరీక్ష కేంద్రానికి ప్రశ్నాపత్రాలు తరలించడం జరుగుతుందని, పరీక్షా కేంద్రం గేటు బయట క్లాక్ రూమ్ ఏర్పాటు చేయాలని, ఎలాంటి తప్పులకు అవకాశం లేకుండా అధికారులు విధులు నిర్వహించాలని తెలిపారు. మాల్ ప్రాక్టీస్ సంబంధిత వార్తలు ప్రసారమైతే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. పరీక్ష నిర్వహణలో ఏమైనా ఇబ్బంది తలెత్తితే వెంటనే అధికారులకు సమాచారం అందించాలని, పరీక్షా కేంద్రంలో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించాలని తెలిపారు. పరీక్ష కేంద్రాలకు కేటాయించిన ప్రకారంగా ప్రశ్నాపత్రాలు వెళ్లేలా అధికారులు పర్యవేక్షించాలని, పరీక్షా కేంద్రంలోనికి మొబైల్ ఫోన్లను అనుమతించకూడదని, అభ్యర్థులను లోనికి అనుమతించ సమయంలో పకడ్బందీగా తనిఖీ నిర్వహించాలని తెలిపారు. పరీక్ష సమయం ముగిసే వరకు విద్యార్థులను బయటకు అనుమతించకూడదని సూచించారు. పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతపై కళాజాతా అవగాహనా కార్యక్రమం

**పెంచికల్ పేట్, ఫిబ్రవరి 24, సూర్య మేజర్ న్యూస్ :**

జిల్లా ఎస్పీ నితికా పంత్ ఆదేశాల మేరకు 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా మంగళవారం పెంచికల్ పేట్ మండల కేంద్రంలోని ఎల్కపల్లి గ్రామపంచాయతీ ఆవరణలో ఎస్సై అనిల్ కుమార్ ఆధ్వర్యంలో పోలీస్




కళాబృందం ప్రదర్శనలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వాహనదారులు హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని, అతివేగం ప్రాణాంతకమని పోలీస్ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. మైనర్ డ్రైవింగ్‌ను ప్రోత్సహించవద్దని తల్లిదండ్రులకు సూచించారు. కళాకారులు పాటల ద్వారా ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలను చైతన్యపరిచారు. రోడ్డు దుర్ఘటనలను నివారించేందుకు అందరూ సహకరించాలని పోలీసులు కోరారు. ఈ కార్యక్రమము పోలీస్ సిబ్బంది, కళాజాత బృందం సిబ్బంది మరియు వాహనదారులు, యువకులు పాల్గొన్నారు.

## ప్రకృతి విపత్తు వలన భారీనష్టం

**నిర్మల్ ఫిబ్రవరి 24, సూర్య మేజర్ న్యూస్.**

రాళ్ల వర్షం కురవడం వలన గ్రామంలో భారీ నష్టం తక్షణమే స్పందించిన అధికార యంత్రాంగం సహాయక చర్యలతో అప్రమత్తం. సోన్ మండలంలోని న్యూ వెల్మల్ గ్రామంలో ప్రకృతి విపత్తు వలన భారీగా రాళ్ల వర్షం కురవడం








వల్ల గ్రామంలో వెల్కమ్ బోర్డుతోపాటు, పలు రోడ్లలో చెట్లు విరగడం జరిగింది. మరియు కరెంటు తీగలు కింద పడ్డాయి .గ్రామ సర్పంచ్ రాచకొండ సాగర్ , గ్రామ యువకులు వెంటనే స్పందించి ప్రజలకు ఏ ఇబ్బంది కలగకుండా వాటిని తొలగించడం జరిగింది. కావున ఈ రాళ్ల వర్షం వల్ల ప్రజలను జాగ్రత్తగా ఉండాలని కోరడం జరిగింది.

### పథకాల వల్ల పేదలు ధైర్యంగా ముందుకు

## సాగుతున్నారు..ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**సిరికొండ, ఫిబ్రవరి 24, సూర్య మేజర్ న్యూస్ :** మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ప్రవేశపెట్టిన పథకాల వల్ల పేదలు ధైర్యంగా ముందుకు సాగుతున్నారని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఇచ్చోడ మండల కేంద్రంలోని రాయల్ ప్యాలెస్ గార్డెన్ లో జరిగిన కళ్యాణ లక్ష్మీ--షాది ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు కొంత భరోసా లభిస్తే వారు జీవితంలో ఎంతో ధైర్యంగా ముందుకు సాగగలరని, ఆ భరోసా ఇవ్వడానికే మాజీ ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావు కళ్యాణ లక్ష్మీ, షాది ముబారక్ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. ఈ పథకాల వల్ల అనేక కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడుతున్నాయన్నారు. ప్రతి అర్హుడికి లబ్ధి చేరాలని, ఎవరికైనా సమస్య ఉన్నా, దరఖాస్తు ఆలస్యం జరిగినా, మాకు తెలియజేస్తే వెంటనే పరిష్కారం అయ్యేలా చూసుకుంటామన్నారు. సంక్షేమ పథకాలు ప్రజల జీవితాల్లో మార్పుని తీసుకురావడమే బిఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు. సిరికొండ మండలానికి చెందిన 7 మంది, ఇచ్చోడ మండలానికి చెందిన 110 మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ తుకారాం,స్థానిక నాయకులు, పెంటన్న, సర్పంచ్ సూర్యాకాంతం,రోహిదాష్, సూర్యకాంతం, చందు, కృష్ణ రెడ్డి,కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



# ఇంటర్, పదవ తరగతి పరీక్షలను ప్రశాంతంగా పూర్తి చేయాలి

## -జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్ ఫిబ్రవరి 24,సూర్య మేజర్ న్యూస్**

ఇంటర్మీడియట్, పదవ తరగతి పరీక్షలను ఎటువంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు.మంగళవారం, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, హైదరాబాద్ నుంచి, ఇంటర్మీడియట్, పదవతరగతి పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో కలిసి, అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ, ఎస్ఎస్ సి, ఇంటర్ పరీక్షలను ప్రశాంతంగా పూర్తి చేయాలన్నారు. పరీక్షల నిర్వహణపై పలు అంశాలను చర్చించారు. పరీక్షల నిర్వహణపై వివరాలను జిల్లాల వారీగా కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టరేట్ విసి హాల్ నుండి పాల్గొన్న అనంతరం జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ, ఇంటర్మీడియట్, పదవతరగతి పరీక్షలను ఎటువంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించాలని




అధికారులను ఆదేశించారు. ఇంటర్మీడియట్ కు సంబంధించి జిల్లాల్లో మొత్తం రేపటి నుంచి, మార్చి 18 వరకు, 8635 మంది ప్రథమ సంవత్సరం విద్యార్థులు, 8891 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు, మొత్తం కలిపి 17,526 విద్యార్థులు, 31 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు రాయనున్నారని అన్నారు. పదవ తరగతి పరీక్షలకు సంబంధించి మార్చి 14వ తేదీ నుంచి, ఏప్రిల్ 16 వ తేదీ వరకు ఉదయం 9.30 నుంచి, 12.30 వరకు, 52 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 10,928 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద, పరీక్షా పత్రాల తరలింపు సమయంలో పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అన్ని పరీక్షా కేంద్రాలలో త్రాగునీరు, విద్యార్థులకు సౌకర్యవంతమైన బెంచీలు, సరైన లైటింగ్, సిబ్బందితో కూడిన వైద్య శిబిరం, తదితర అవసరాలకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకునే విధంగా, పరీక్షల సమయాలకు అనుగుణంగా బస్సులను నడపాలని పేర్కొన్నారు. పరీక్షలు జరుగుతున్నతసేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకోవాలని వివరించారు. పరీక్షా కేంద్రాల సమీపంలో జిరాక్స్ దుకాణాలు మూసివేసి, బిఎన్ఎస్ సెక్షన్ 163 (సీఆర్పీసీ 144) అమలు చేయాలని అన్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా, పారదర్శకంగా పరీక్షలను పూర్తి చేయాలని తెలిపారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు శ్యామలాదేవి, రాజేశ్వర్, ఆర్డీఓ స్రవంతి, డిఐఈఓ గణేష్ జాదవ్, డిపివో రమేష్, వైద్య, రవాణా, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయిలో రెండవ బహుమతి అందుకున్న రాఘవేంద్ర కరిమల విద్యార్థి

**జన్నారం, ఫిబ్రవరి 24, సూర్య మేజర్ న్యూస్ :**

ఇటీవల రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో రాఘవేంద్ర కరిమల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ బైపీసి మొదటి సంవత్సరం చదువుతున్న కొట్టె అభిషేక్ హైదరాబాద్ ఎల్బీ స్టేడియం లో



జరిగిన సీఎం కప్ రాష్ట్ర స్థాయిలో రెండవ బహుమతిని గెలుచుకున్నాడు. ఈ సందర్భంగా రాఘవేంద్ర విద్యా సంస్థల చైర్మన్ ఎర్ర చంద్రశేఖర్ అభిషేక్ ను అభినందిస్తూ, పిల్లలకు ఇలాంటి కళలు ఎంతో అవసరమని ఇలాంటి కప్ లు మరెన్నో గెలిచి, కళాశాలకు మీ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాఘవేంద్ర విద్యా సంస్థల కరస్పాండెంట్ ఎర్ర సంపత్, కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మణ్, డీన్ హేమలత షిండే, కళాశాల అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## జాబ్ మేళాకు విశేష స్పందన

**ఆదిలాబాద్ టౌన్, ఫిబ్రవరి 24: మేజర్ సూర్య న్యూస్:** జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఆదిలాబాద్ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో మంగళవారం నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. జిల్లా నలుమూలల నుంచి యువత పెద్ద సంఖ్యలో హాజరై తమ అర్హతలకు అనుగుణంగా ఉద్యోగాల కోసం నమోదు చేసుకున్నారు. ఎంపికైన అభ్యర్థులకు శిక్షణ ఇచ్చిన అనంతరం సంబంధిత సంస్థల్లో ఉపాధి కల్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ జాబ్ మేళా ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు విస్తరించనున్నాయని, ప్రైవేట్ రంగంలో స్థిరమైన ఉద్యోగాలు పొందేందుకు ఇది ఉపయోగకరంగా ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.

## క్రీడా పాఠశాలలో ప్రవేశానికి సెలక్షన్స్

**ఆదిలాబాద్ టౌన్, ఫిబ్రవరి 24: మేజర్ సూర్య న్యూస్:** జిల్లాలోని క్రీడా పాఠశాలల్లో 2026-27 విద్యా సంవత్సరానికి గాను 4వ తరగతిలో ప్రవేశాల కోసం సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఒక ప్రకటనలో తెలిపారు.2017 అక్టోబర్ 1నుంచి 2018 ఆగస్టు 31 మధ్య జన్మించి, ప్రస్తుతం 3వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. మండల స్థాయి ఎంపికలు మార్చి 3 నుంచి 17 వరకు జరుగుతాయని తెలిపారు. అక్కడ ఎంపికైన వారికి మార్చి 28 నుంచి ఏప్రిల్ 1 వరకు జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జిల్లా స్థాయి ఎంపికలు నిర్వహిస్తారని వివరించారు. ఆసక్తి గల వారు ముందస్తుగా ఆన్లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, అభ్యర్థులు తమతో పాటు జనన ధృవీకరణ పత్రం, ఆధార్ కార్డ్, కుల ధృవీకరణ పత్రం, స్టడీ సర్టిఫికేట్, 10 పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు తీసుకురావాలని పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం సెల్:9440765485, 9440603944 నంబర్లపై సంప్రదించాలని సూచించారు.

## గ్రామాభివృద్ధికి ఆదర్శంగా నిలిచిన గుస్సాడి బృందం

**సిర్పూర్ యూ ఫిబ్రవరి 24 సూర్య మేజర్ న్యూస్**

కొమరం భీం జిల్లా, సిర్పూర్ (యు) మండలం, కోహినూర్ (బి) గ్రామ పంచాయతీ పరిధిలోని సోము గూడ గ్రామంలో పద్మశ్రీ కనకరాజు గుస్సాడి బృంద సభ్యులు ఒక ఆదర్శ కార్యక్రమాన్ని నిర్వహించారు.గుస్సాడి బృందం లీడర్ కనక సుదర్శన్ ఆధ్వర్యంలో సభ్యులందరూ కలిసి గ్రామాభివృద్ధికి



చేయూతనందిస్తూ సుమారు రూ.50,000లు సమకూర్చి గ్రామంలో హైమాస్ట్ (మ్యాక్స్) లైట్లు ఏర్పాటు చేశారు."ఊరంతా వెలుగు -- మా జీవితానికి వెలుగు" అనే సంకల్పంతో యువత ఒకటై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు కనక సుదర్శన్, పటేల్ తొడ సం గంగారం, దేవరీ కుమ్రం మారు, కారోబారి జూగ్నక గోది రావ్, ఆత్రం దేవ్ రావ్, అంబాజీ రావ్, చందు, నోవా నాథ్, సాయిరాజ్, గోవింద్, సంజీవ్, నాగోరావ్, నరేష్, రవీందర్, రమేష్, జంగు, హన్మంత్, కీర్తన్, షేకు, తులసిరాం తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా గ్రామస్తులు మరియు పటేల్ దేవరి గ్రామ ప్రజలు యువకులను అభినందిస్తూ, వారి సేవాభావాన్ని ప్రశంసించారు.

## గిరిజన డిగ్రీ కళాశాల అడ్మిషన్ ప్రచారానికి శ్రీకారం -- పోస్టర్, బ్యానర్ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ రాజర్షిషా

**ఆదిలాబాద్, ఫిబ్రవరి 24: మేజర్ సూర్య న్యూస్:**

2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించి గిరిజన గురుకుల డిగ్రీ కళాశాల అడ్మిషన్ పోస్టర్, బ్యానర్ను జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆవిష్కరించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు, తల్లిదండ్రులకు అందుబాటులో ఉన్న అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులైన బీఏ, బీకాం(సీఏ), బీజడ్సీ, డాటా సైన్స్, ఎంపీసీఎస్ వంటి కోర్సులతో పాటు అడ్మిషన్ విధానం గురించి అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శివకృష్ణతో పాటు లెక్చరర్లు ఎస్.సురేందర్, గణేష్, ప్రీతం పాటిల్ తదితరులు పాల్గొన్నారు.




# ఉపాధి హామీ పనులపై

## అవగాహన కల్పించిన ఎంపీడీవో కృష్ణారావు



**సిర్పూర్ – యూ ఫిబ్రవరి 24 సూర్య మేజర్ న్యూస్**

సిర్పూర్ యు మండలం ధానోరా గ్రామపంచాయతీ ఉపాధి హామీ పనుల పై ఎంపీడీవో కృష్ణారావు అవగాహన కల్పించారు.ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఉపాధి హామీ కూలీల డబ్బులు వెంటనే అందించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.ప్రతి ఊరికి 100 రోజులు ఉపాధి లభిస్తుందన్నారు.ఈ కార్యక్రమంలోటెక్నికల్ అసిస్టెంట్ తిరుపతి, ఫీల్డ్ అసిస్టెంట్, సోయం లక్ష్మణ్, సీనియర్ మెట్ పవర్ విట్టల్ పాల్గొన్నారు.

# అకాల వర్షాలతో రైతులకు కన్నీళ్లు



**నార్నూర్ ఫిబ్రవరి 24 సూర్య మేజర్ న్యూస్**

లో కురిసిన అకాల వర్షాలకు రైతుల కన్నీళ్లు మిగిల్చాయి. కాగా నార్నూర్ మండలం భీంపూర్ గ్రామానికి చెందిన రైతు జాదవ్ రఘునాథ్ తన రెండెకరాల పొలంలో గోధుమ పంటను వేశారు. కానీ ఒక్కసారిగా వచ్చిన ఈదురుగాలులు భారీ వర్షంతో పంట మొత్తం నాశనం అయిపోయింది. దీంతో కేవలం వ్యవసాయ ఆధారిత జీవనం కొనసాగిస్తున్న తాము అప్పులు చేసి మరీ పంటను వేస్తే అకాల వర్షంతో తీవ్ర నష్టం వచ్చిందని రైతు కన్నీళు ల్లపెట్టుకున్నారు. వ్యవసాయంపై జీవించే తాము అకాలవర్షలతో తీవ్ర నష్టం ఏదుర్కొన్నామని అధికారులు స్పందించి తమకు నష్టపరిహారం ఇవ్వాలని రైతు వేడుకున్నారు.

## వార్డ్ పనుల ను

# పరిశీలించిన కౌన్సిలర్ సత్యం

**ఖానాపూర్ ,సూర్య మేజర్ న్యూస్ :**

ఖానాపూర్ పట్టణంలోని జెకె నగర్ మరియు విద్య నగర్ కాలనీలలో జరుగుతున్న నూతన సిసి రోడ్లు డ్రైనేజీ పనులను ఖానాపూర్ నియోజకవర్గ



ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆదేశాల మేరకు ఖానాపూర్ 11వ వార్డు కౌన్సిలర్,ఖానాపూర్ తాజా మాజీ మున్సిపల్ చైర్మన్ రాజుర సత్యం పరిశీలించరు. సీసీ రోడ్లు నిర్మాణపు పనులు వార్డులో నాణ్యతా ప్రమాణాలతో నిర్మిస్తున్నారని తెలిపారు.ఇందులో మున్సిపాలిటీ ఎఈ , కాలనీవాసులు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

## రేపు వాహనాల వేలం పాట


**ఆదిలాబాద్ టౌన్, ఫిబ్రవరి 24: మేజర్ సూర్య న్యూస్:**

వివిధ కేసుల్లో ఆదిలాబాద్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పట్టుబడిన వాహనాలకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ విజేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26న ఆదిలాబాద్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లో 15 బైక్లు, ఒక ఆటోకు వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల వారు ప్రభుత్వం నిర్దేశించినన ధరావత్తు సొమ్మును చెల్లించి బహిరంగ వేలం పాటలో పాల్గొనవచ్చని తెలిపారు.

# ఖమ్మం జిల్లా గ్రామీణ పేదల సంఘం పై పోలీసు జులుం!

## - ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంబాల మహేందర్

**బెల్లంపల్లి, ఫిబ్రవరి 24, సూర్య మేజర్ న్యూస్:** ఖమ్మం జిల్లా వెలుగుమాట్ల గ్రామం నందు గత 12 సంవత్సరాలుగా భూదాన్ భూముల నందు భూమిలేని నిరుపేదలు ఇల్లు నిర్మించుకొని జీవనం కొనసాగిస్తున్నారు. ఈ భూదాన్ భూములకు సంబంధించి హైకోర్టు ఆర్డర్ ఉన్నప్పటికీ అధికార పార్టీ యంత్రాంగం, మరియు మంత్రులు కోర్టు ఆర్డర్ ను ధిక్కరించి ఈరోజు ఉదయం పేదల ఇండ్లను కూల్చి వేయడానికి వేల మంది పోలీసులు బలగాలను రంగంలోనికి దింపి అక్కడ నివసించే వారిని భయభ్రాంతులకు గురి చేస్తూ



జెసిబి లతో పేదలు వేసుకున్న ఇళ్లను నేలమట్టం చేశారు. ఖమ్మం జిల్లా వెలుగుమాట్ల లో జరుగుతున్నటువంటి విషయాలను కవర్ చేయడానికి వెళుతున్న తొలి వెలుగు జర్నలిస్టులను వెళ్లకుండా అడ్డుకోవడం అధికార పార్టీ నాయకుల నీతిమాలిన తనానికి నిదర్శనం అని కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలతో అధికారంలోనికి రాగానే ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి పేదల ఇండ్లను కూల్చి వేయడానికి ఈ రోజు కంకణం కట్టుకుంది. ఇండ్లు లేని పేదలకు ఇందిరమ్మ గృహాలు నిర్మించి ఇస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి సర్కార్ కు ఖమ్మం జిల్లా వినోబా గ్రామం నందు జరుగుతున్న సంఘటనలు నిదర్శనం. ఇప్పటికైనా కోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలు చేసి అక్కడ ప్రజలకు ఉపయోగకరంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ డిమాండ్ చేస్తున్నది. లేనిపక్షంలో గ్రామీణ పేదల సంఘం ఆధ్వర్యంలో జరగబోయే ఆందోళన కార్యక్రమాలకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించవలసి ఉంటుందని డిమాండ్ చేస్తుంది. అలాగే ఖమ్మం జిల్లా ఇనోవా గ్రామ ప్రజలు చేస్తున్న న్యాయమైన పోరాటానికి ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుంది అని ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంబాల మహేందర్ అన్నారు.

# వసతి గృహ విద్యార్థులకు మెరుగైన విద్యనందించండి

## - ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మార్మాట్



**అసిఫాబాద్ ,ఫిబ్రవరి24,సూర్య మేజర్ న్యూస్**

ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని అర్థమయ్యే రీతిలో భోదించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మార్మాట్ ఉపాధ్యాయులను ఆదేశించారు.మంగళవారం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలు(బాలికలు)మరలవయ్ మరియు ఈ ఏం ఆర్ ఎస్ కళాశాల (బాలూరు)సిర్పూర్, గిరిజన ఆశ్రమ పాఠశాలల(బాలురు)కాగజనగర్ ను ప్రాజెక్ట్ అధికారి సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న విద్య, వైద్యం, భోజనంపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో ఇష్ట గోష్టితో మాట్లాడుతూ ఏమైనా సమస్యలు ఉన్నాయా సమయానికి భోజనాన్ని అందిస్తున్నారా మెనూ ప్రకారంగా అందిస్తున్నారా భోజనాలు రుచికరంగా ఉన్నాయా అని తెలుసుకొని క్లాస్ రూమ్ లో విద్యార్థులతో ముచ్చటించి వారికి పాటలను బోధించారు విద్యార్థులకు వండిన ఆహారాన్ని రుచిని ఆస్వాదించారు, అలాగే కంప్యూటర్ ల్యాబ్ ను పరిశీలించారు ,ఐటీడీఏ పల్స్ యాప్ పనితరుపై ఆరా తీశారు, పదవ తరగతి విద్యార్థులకు 100% ఉతిర్ణత వచ్చే విధంగా చదివిపించాలని ఉ వ ధ్యా య ు ల క ు తెలిపారు, ఈఏం ఆర్ ఎస్ కళాశాల విద్యార్థులకు ఇంటర్మీడియట్ తో చదువుని ఆపకూడదని ఐఐటి,జేఈఈ మెయిన్ వంటి వివిధ ఉన్నత విద్యలు చదవాలని అన్నారు,పల్స్ యాప్ పై ఏమైనా సమస్య ఉంటే తమ దృష్టిలోకి తీసుకురావాలని పేర్కొన్నారు ఈ సందర్భంగా పిఓ మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రతిరోజూ మెనూ ప్రకారం పోషక విలువలు గల ఆహారాన్ని అందించాలన్నారు వార్డెన్, ప్రిన్సిపల్కు, కామటీ, వంట పని వారు, శానిటరీ మరియు మల్టీపర్పస్ వర్కర్లు కు సూచించారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలనీ అన్నారు. దోమల వలన వ్యాపించే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా, వసతి గృహ పరిసరాలలో నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రతిరోజు వంటగది, స్టోర్ రూమ్, తాగునీరు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు భోదించారు. సబ్జెక్టుల వారీగా ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం తప్పనిసరిగా రావాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమాలలో ,పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతపై కళాజాతతో అవగాహన

**వాంకిడి, ఫిబ్రవరి 24,సూర్య మేజర్ న్యూస్**

మండలంలోని ఖమాన గ్రామంలో మంగళవారం రోడ్డు భద్రత కార్యక్రమాల్లో భాగంగా 'అరైవ్-అలైవ్' పేరిట కళాజాత నిర్వహించారు. గ్రామ కేంద్రంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో కళాజాత బృందం సభ్యులు పాటలు, నాటికల ద్వారా రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజల్లో చైతన్యం కల్పించారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు రోడ్డు



భద్రత నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాల్సిన అవసరాన్ని గుర్తుచేశారు. అతివేగం ప్రాణాంతకమని, నిబంధనలకు అనుగుణంగా ఆర్సీ, డ్రైవింగ్ లైసెన్స్, బీమా పత్రాలు కలిగి ఉండాలని తెలిపారు.అత్యుత్సాహంతో వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు సంభవించి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సురక్షిత ప్రయాణం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, కళాజాత బృందం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో వెలుగులు .. ప్రజల్లో సంతోషం

**సిరికొండ, ఫిబ్రవరి 24, సూర్య మేజర్ న్యూస్**

సిరికొండ మండలంలోని కుంటాగూడ గ్రామపంచాయతీ పరిధిలోని పాలవాగు, రాంజీగూడ గ్రామాలు మంగళవారం కొత్త వెలుగులతో మెరిశాయి. గ్రామాల్లో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను సర్పంచ్ కుమరం మీరాబాయి, ఉపసర్పంచ్ చిక్రం పరమేశ్వర్ ప్రారంభించారు.గ్రామాల్లో రాత్రివేళ వెలుగుల కొరత కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి ఈ సౌకర్యాన్ని కల్పించినట్టు సర్పంచ్ తెలిపారు. మరిన్ని ప్రాథమిక సదుపాయాల విస్తరణకు చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. హైమాస్ట్ లైట్లు వెలిగడంతో గ్రామాల్లో ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కుమరం యాదవ్ రావు, పంచాయతీ కార్యదర్శి సాయికృష్ణ, గ్రామ పటేల్, గ్రామస్తులు పాల్గొన్నారు.



## హిందీ భాషా సేవ చేయడం అదృష్టం

**ఆదిలాబాద్ టౌన్, ఫిబ్రవరి 24: మేజర్ సూర్య న్యూస్:**

ఉద్యోగం చేస్తూనే జాతీయ హిందీ భాషా సేవలో నిరంతరం తరించడం హిందీ ఉపాధ్యాయులకు మాత్రమే సాధ్యమవుతుందని హిందీ భాషా సేవా సమితి జిల్లా అధ్యక్షులు సుకుమార్ పెట్కులే అన్నారు. పెండల్వాడ కాంప్లెక్స్



హిందీ ఉపాధ్యాయుల కాంప్లెక్స్ మీటింగ్ మావల ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఫిబ్రవరి 28న ఉద్యోగ విరమణ పొందే హిందీ సీనియర్ ఉపాధ్యాయులు రఘునాథ్ పవార్ కాంప్లెక్స్ ను ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు సోగుల సుదర్శన్ మాట్లాడుతూ అందరితో కలుపుగోలుగా ఉండే రఘునాథ్ పవర్ మంచి కంఠస్వరంతో పాటలు పాడి విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులను అలరించేవాడని తెలిపారు. ఉపాధ్యాయుల సేవలు హిందీ భాషాభివృద్ధికి ఎంతగానో తోడ్పడతాయని అన్నారు. డీఆర్పీ జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ సాహిత్యం, సంగీతం పాటల ద్వారా రఘునాథ్ పవర్ భాషాభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. అనంతరం రఘునాథ పవార్ మాట్లాడుతూ తన జీవితంలో ఎన్నో కష్టసుఖాలు ఎదుర్కొన్నానని, ఎంత పెద్ద సమస్య అయినా చిన్నగా చేసి చూస్తే అది చిన్న సమస్యగా మారిపోతుందని అన్నారు. హిందీలో మంచి నైపుణ్యాన్ని సంపాదించుకొని విద్యార్థులకు సేవలందించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్.దినేష్ కుమార్, రామకృష్ణ గౌడ్, విలాస్ రెడ్డి, సంజీవని, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

## పీఎం శ్రీ మోడల్ స్కూల్ ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం: ప్రిన్సిపల్ మిట్ట వెంకటస్వామి

**సిర్పూర్ యూ ఫిబ్రవరి 24 సూర్య మేజర్ న్యూస్**

సిర్పూర్ యు పీఎం శ్రీ తెలంగాణ మోడల్ స్కూల్లో నేడు జరిగే



ఇంటర్మీడియట్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మిట్ట వెంకటస్వామి మంగళవారం తెలిపారు.ఈ కేంద్రంలో 378 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్షలు ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయి. విద్యార్థులకు వైద్య చికిత్సలతో పాటు అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు, వారు పరీక్ష ప్రారంభానికి అరగంట ముందుగానే కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

## హెల్మెట్ లేకుంటే ప్రాణాలకు ముప్పు
## 'అరైవ్--అలైవ్'లో ఏఎస్పీ చిత్తరంజన్ హెచ్చరిక

**వాంకిడి ఫిబ్రవరి 24,సూర్య మేజర్ న్యూస్**

రోడ్డు ప్రమాదాల్లో ప్రాణనష్టం అధికంగా హెల్మెట్ ధరించకపోవడమే కారణమని ఆసిఫాబాద్ ఏఎస్పీ చిత్తరంజన్ పేర్కొన్నారు. 'అరైవ్--అలైవ్' కార్యక్రమంలో భాగంగా వాంకిడి మండల కేంద్రంలోని జైత్వాన్ బుద్ధ విహార్లో నిర్వహించిన అవగాహన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నాగోషే పెంటు (బెండార గ్రామం) కుటుంబ సభ్యుల చేతుల మీదుగా 25 మంది ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్లు పంపిణీ చేశారు. అలాగే మృతుడి కుటుంబానికి నెలకు సరిపడ నిత్యావసర సరుకులను అందజేశారు.ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ రాష్డ్రైవింగ్, మద్యం సేవించి వాహనం నడపడం, రాంగ్‌రూట్‌లో ప్రయాణించడం వంటి చర్యలు ప్రమాదాలకు దారి తీస్తాయని హెచ్చరించారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించడంతో పాటు రోడ్డు భద్రతా నియమాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. వాహనాలకు సంబంధించిన పత్రాలు సక్రమంగా కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో వాంకిడి ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, ఎస్ఐ మహేందర్ తదితర సిబ్బంది పాల్గొన్నారు



# సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకు

## మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించండి

### - చాలీచాలని పెన్షన్ తో వయోభారంలో ఇబ్బందులు- మెరుగైన వైద్య సౌకర్యాలు అందక తనువుచాలిస్తున్న రిటైర్డ్ కార్మికులు

**మందమర్రి, ఫిబ్రవరి 24, సూర్య మేజర్ న్యూస్**

సింగరేణి పదవి విరమణ పొందిన ఉద్యోగులకు ఉచిత వైద్య సౌకర్యాలు కల్పించాలని గత కొన్ని సంవత్సరాలుగా కోరుతూనే ఉన్నప్పటికీ గత ప్రస్తుత ప్రభుత్వాలు వారిని కనికరించటం లేదు.రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు పెన్షనర్లకు ప్రత్యేకంగా నగదు రహిత ఆరోగ్య భీమా పథకం ప్రవేశపెట్టడం చాలా సంతోషకరమైన విషయం.దీనివలన దాదాపు 8 లక్షల మందికి లబ్ది జరుగుతుంది. ఇదే రీతిలో సింగరేణి డిటైర్డ్ ఉద్యోగులకు కూడా ఉచిత వైద్య సౌకర్యాలు కల్పించాలని గత కొన్ని సంవత్సరాలుగా కోరుతూనే ఉన్నారు. ప్రస్తుతం నలభై వేల రూపాయల చెల్లింపుతో జీవితాంతం భార్యాభర్తలు ఇరువురికి కలిపి 8 లక్షల బీమా సౌకర్యం (సిపిఆర్ఎంఎస్) కల్పిస్తున్నారు. అయితే కొన్ని దీర్ఘకాల వ్యాధులకు ఉచితంగానే వైద్య సౌకర్యాలు కల్పిస్తున్నారు.సింగరేణి దవాఖానాలలో ఉచితంగా అవుట్ పేషంట్ వైద్య సౌకర్యాలు అందిస్తున్నారు. దినదినం పెరుగుతున్న వైద్య ఖర్చులతో, కొత్తగా పుట్టుక వస్తున్న రోగాలకు ఈ ఎనిమిది లక్షలు సరిపోవడం లేదు. ఫలితంగా సరియైన వైద్యం కోసం తల్లడిల్లి అల్లాడిపోతున్నారు.చాలీచాలని పెన్షన్‌తో వయోభారంలో రోగాలకు సరియైన వైద్యం చేయించుకోలేక బ్రతుకుతును కొనసాగిస్తున్నారు.మెరుగైన ఉచిత వైద్య సౌకర్యాలు కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, డాక్టర్ వివేక్ వెంకటస్వామి, అద్లూరి లక్ష్మణ్ కుమార్‌లకు అనేకసార్లు మొరపెట్టుకున్నారు. ప్రజా పాలన ప్రజావాణి కార్యక్రమాల్లో కూడా అనేక విజ్ఞాపన పత్రాలు అందజేశారు. గత శాసనసభ సమావేశాలలో రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్,మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణలు ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయిన ఫలితం శూన్యం. నూతనంగా బాధ్యతలు చేపట్టిన చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జ్యోతి బుద్ధ ప్రకాష్ కు కూడా వీరి దీనగాథను వినిపించారు. సింగరేణి రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో నడుస్తున్న ప్రత్యేక ప్రతిపత్తిగల సంస్థ రాష్ట్ర సర్వతో ముఖాభివృద్ధికి, సింగరేణి ఇతోదికముగా నిధులు సమకూరుస్తుంది కానీ సంస్థ నుండి వేరుపడిన రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమం పట్ల దృష్టి సారించడం లేదు. తెలంగాణ అభివృద్ధికి తోడ్పడుతున్న విధంగా సంస్థ లాభాలకు పునాదులు వేసిన స్వంత రిటైర్డ్ ఉద్యోగులకు సైతం వైద్య సౌకర్యాలు కల్పించేందుకు తగిన చర్యలు సత్వరమే చేపట్టాలి.అలాగే హైదరాబాదులో ఏర్పాటు చేయనున్న సింగరేణి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో రిటైర్డ్ ఉద్యోగులకు అన్ని విధముల ఉచిత వైద్య సౌకర్యాలు కల్పించాలనేది వారి ప్రధాన విజ్ఞప్తి.మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పిస్తారని చాలామంది ఆశతో ఎదురుచూసి ఫలాలు అందకుండానే తనువుచాలిస్తున్నారు. జీవిత చరమాంకంలో ఉన్న వీరికి అన్ని విధముల ఉచిత వైద్య సౌకర్యాలు కల్పించాలని ప్రాధేయపడుతున్నారు.బొగ్గు ఉత్పత్తికి అహర్నిశలు చెమట రక్తం దార పోసి కష్టించి పని చేశారు. ప్రకృతికి విరుద్ధంగా గాలి వెలుతురు లేని చోట విధులు నిర్వహించారు. చేసిన కష్టాన్ని గుర్తించి కోల్ ఇండియాతో సంబంధం లేకుండా వీరి దీనగాథను అర్థం చేసుకుని సింగరేణి ఆధ్వర్యంలో మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించుటకు సానుభూతితో పరిశీలించాలని పదవి విరమణ పొందిన సింగరేణి ఉద్యోగులు వేడుకుంటున్నారు.

## ప్రతి రైతు ఈనెల 28 లోగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.... ఏఓ రామకృష్ణ

**పెంచికల్ పేట్, ఫిబ్రవరి 24, సూర్య మేజర్ న్యూస్ :**

భూమి ఉన్న ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏఓ రామకృష్ణ సూచించారు. సోమవారం ఎల్కపల్లి రైతు వేదికలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ కార్యక్రమంలో మాట్లాడుతూ, ఈ నెల 28 వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు.మండలంలోని పలు గ్రామాల్లో ఇప్పటివరకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోని రైతులు త్వరగా పూర్తి చేయాలని ఆయన కోరారు. కేంద్ర ప్రభుత్వ పథకం పీఎం కిసాన్ సహాయం పొందాలంటే ఈ కేవైసీ పూర్తి చేసుకోవడం తప్పనిసరి అని చెప్పారు.ప్రభుత్వ సబ్సిడీ పథకాలు, పంటల కొనుగోలు-అమ్మకాలకు కూడా ఈ రిజిస్ట్రేషన్ నంబర్ అవసరమని రామకృష్ణ పేర్కొన్నారు. వివరాలకు రైతు వేదికలోని వ్యవసాయ అధికారులను సంప్రదించాలని తెలిపారు .ఈ కార్యక్రమంలో ఎఈఓ వంశీ మరియు రైతులు పాల్గొన్నారు.




# ఎంపీడీఓ కార్యాలయంలో తాండవిస్తోన్న అపరిశుభ్రత

### - పరిశుభ్రత సూక్తులు మాకు వర్తించవు

**మందమర్రి, ఫిబ్రవరి 24, సూర్య మేజర్ న్యూస్**

ప్రతీ ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని, పరిశుభ్రతతోనే గ్రామాల ప్రగతి సాధ్యమవుతుందని మండల ప్రజలకు సూక్తులు చెప్పే మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అపరిశుభ్రత తాండవిస్తోంది. చుట్టూ చెత్త లేకపోతే... వ్యాధులు దూరం. పరిశుభ్రమైన వాతావరణం -- ఆరోగ్యానికి అద్దం. గ్రామ ప్రగతికి, అభివృద్ధికి పరిశుభ్రత మొదటి అడుగు. పరిశుభ్రత ఉన్న చోట అభివృద్ధి వెలుగులు. పరిశుభ్రత మన హక్కు కాదు... మన బాధ్యత. శుభ్రంగా ఉండే గ్రామం లోనే ఆరోగ్యం స్వచ్ఛత స్ఫూర్తి. ఈ సూక్తులు మండల ప్రజలకు మాత్రమే వర్తిస్తాయి, ఈ షరతులు నిబంధనలు మాకు వర్తించవని నిరూపిస్తున్నారు ఎంపిడిఓ కార్యాలయ అధికారులు. మండలానికి కేంద్ర బిందువుగా ఉన్న ఎంపీడీఓ కార్యాలయంలో



అధికారుల నిర్లక్ష్యంతో పరిశుభ్రత లోపం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇటీవల వార్డు మెంబర్లకు శిక్షణ తరగతులు నిర్వహించిన సమయంలో వారికి ఎంపీడీఓ కార్యాలయంలో భోజనాలు ఏర్పాటు చేశారు. భుజించిన ఇస్తార్లను కార్యాలయ ఆవరణలోనే వేశారు. వారం రోజులు గడవడంతో కార్యాలయ ప్రాంగణంలో పేరుకుపోయిన చెత్త నిల్వ, కుళ్ళిపోయిన ఆహారపదార్థాలతో వాంతులు వచ్చే స్థాయిలో దుర్గంధం వెదజల్లడంతో ఎంపీడీఓ కార్యాలయం పరిసరాల్లో దుర్వాసన తీవ్రంగా వ్యాపిస్తోంది. దీంతో ఎంపిడిఓ కార్యాలయానికి, కార్యాలయంలోని మీ సేవా కేంద్రానికి పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు ప్రజలు ముక్కులు మూసుకుంటున్నారు. వానలు కురిసిన తర్వాత పరిస్థితి మరింత అధ్వాన్నంగా మారి పక్కనే ఉన్న తహసిల్దార్ కార్యాలయానికి సైతం దుర్గంధం వెదజల్లుతోంది. అధికార యంత్రాంగం నిర్లక్ష్యం వల్ల కార్యాలయ ప్రాంగణం చెత్త గుట్టలతో మారుమూల బస్తీల పరిస్థితిని తలపిస్తోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలానికి కేంద్ర బిందువైన ఎంపీడీఓ కార్యాలయంలో మొదట పరిశుభ్రత అనేది పాటించాలని, శుభ్రతా చర్యలు చేపట్టకపోవడంతో ఈ దుస్థితి తలెత్తిందని, సత్వరమే శుభ్రత చర్యలు ప్రారంభించి, కార్యాలయం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# ఆదివాసి ఎమ్మెల్యే కోవ లక్ష్మిపై

### కేసు వెనక్కి తీసుకోకపోతే ఉద్యమం తప్పదు

## - ప్రశ్నించినందుకే కేనా..?

### - ఇది ఆదివాసీలకు అవమానం

**జైనూర్ సూర్య మేజర్ న్యూస్**

స్వరాన్ని అణిచివేయాలనే ప్రయత్నంగా ఆదివాసీ మహిళ ఎమ్మెల్యే కోవ లక్ష్మి పై కేసు నమోదు చేయడం ప్రజాస్వామ్యంపై దాడి అని ఆదివాసీ సంఘాల ఐక్యకార్యచరణ సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడేంట్,మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్ కనక యాదవ రావు మండిపడ్డారు. మంగళవారం జైనూర్ లో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వెంటనే అక్రమ కేసును వెనక్కి తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు.క్యాతన్‌పల్లిలో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల సందర్భంగా ఇన్‌చార్జ్‌గా వెళ్లిన ఎమ్మెల్యే అన్యాయాలపై ప్రశ్నించారని తెలిపారు. ప్రశ్నిస్తే పోలీసులతో అడ్డగించి, తోపులాట సృష్టించి, చివరకు అదే



అంశాన్ని కారణంగా చూపించి కేసు పెట్టించడం రాజకీయ కక్షసాధింపే అని ఆరోపించారు. మంత్రి వివేక్ వెంకట్ స్వామి కుట్రపూరితంగా ఈ వ్యవహారాన్ని నడిపించారని తీవ్ర ఆరోపణలు చేశారు. క్యాతన్‌పల్లి ప్రజలు ఇప్పటికే తమ తీర్పు ఇచ్చారని, బల్దియా ఎన్నికల్లో కాంగ్రెస్‌ను తిప్పికొట్టారని గుర్తుచేశారు. మంత్రి వివేక్ వెంకట్ స్వామి తన అధికార మదంతో కౌన్సిలర్లపై ఒత్తిళ్లు తెచ్చి కోరం ఏర్పాటు చేయాలని ప్రయత్నించడం సిగ్గుచేటని విమర్శించారు. పోలీసులను, అధికారులను రాజకీయాలకు వాడుకోవడం ప్రజాస్వామ్యానికి మచ్చ అన్నారు. గత ప్రభుత్వ హయంలో కుమ్రం భీం జిల్లా ఏర్పాటు, జోడేఘాట్‌లో కుమ్రం భీం మ్యూజియం స్థాపన, పూలాజీ బాబా మహోత్సవం, జంగుబాయి జాతర, కేస్లాపూర్ నాగోబా జాతర అభివృద్ధికి,గుస్సాడి దండారి ఉత్సవాలనిధులు తీసుకువచ్చిన నాయకురాలివాలు కోవ లక్ష్మి అని తెలిపారు. అలాంటి నాయకురాలిని రాజకీయ కుట్రలో భాగంగా టార్గెట్ చేయడం ఆదివాసీ సమాజాన్ని అవమానించడమేనన్నారు. ఆదివాసీలు రాజకీయంగా ఎదగకూడదనే కుట్ర ఇది. మా మహిళా ఎమ్మెల్యేను కించపరచే ప్రతి ప్రయత్నానికి తగిన సమాధానంతప్పక ఇస్తాం. కేసులు ఎత్తివేయకపోతే ఆదివాసీల ఆగ్రహం ఎలా ఉంటుందో చూపిస్తామని స్పష్టం చేశారు.ప్రశ్నిస్తే కేసులు పెట్టే ప్రభుత్వానికి ప్రజలే గుణపాఠం చెబుతారని, రాబోయే ఎన్నికల్లో రాజకీయ సమాధి తప్పదని హెచ్చరించారు..బిఆర్ఎస్ సిర్పూర్( యు) మండల పార్టీ అధ్యక్షులు తోడసం ధర్మరావు, ఏం. భీంరావు, మెస్రం బొజ్జు, కోడప సీతరాం,తదితరులు ఉన్నారు.

## పదో తరగతి ప్రతిభావంతులకు నగదు ప్రోత్సాహం

**కడెం. సూర్య మేజర్ న్యూస్:** ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మద్దిపడగ గ్రామానికి చెందిన ఎస్ఆర్ఎ సంస్థ సంకీర్త రాజు ఆర్థిక చేయూతని ప్రకటించారు. తన తండ్రి స్వామిదాస్ జ్ఞాపకార్థం ఏటా పదో



తరగతి టాపర్లకు నగదు బహుమతులు అందజేయనున్నారు. ప్రథమ స్థానానికి రూ. 20 వేలు, ద్వితీయ స్థానానికి రూ.10 వేలు, తృతీయ స్థానానికి రూ. 5 వేలు ఇస్తామన్నారు. ఈ సందర్భంగా దాతను సర్పంచ్ విజయ్ కుమార్ సన్మానించారు.

## సర్పంచ్ వెడ్మ నరేష్ ఆధ్వర్యంలోపలు అభివృద్ధి పనులు

**తిర్యాణి ,సూర్య మేజర్ న్యూస్**

గిన్నెదరి సర్పంచ్ వెడ్మా నరేష్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ అభివృద్ధే ధ్యేయంగా బోర్గం కాలనీ నుండి నాయకపు గూడ వరకు మొరంతో రోడ్డుగుంతలు పూడ్చి రోడ్డుకి ఇరువైపులా చెట్ల పొదలు తీసేసి మరమ్మత్తు



కార్యక్రమం చేపట్టారు రానున్న వేసవి కాలం దృష్ట్యా గ్రామపంచాయతీ లోని పలు గ్రామాల్లో ప్రజలకి మంచినీటి సమస్య లేకుండా ఉండేందుకు మంచినీటి బోరింగులు వేపించారు ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ బోర్లకుంట మనీష్, గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మండలంలో పలు అభివృద్ధి పనులను పరిశీలించిన ఎంపీడీవో

**పెంచికల్ పేట్, ఫిబ్రవరి 24, సూర్య మేజర్ న్యూస్ :**

మండల ఎంపీడీఓ ఆల్బర్ట్ ఎల్కపల్లి, చెడ్వాయి,ఎల్లూర్ గ్రామ పంచాయతీలలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ప్రతి కుటుంబానికి 100 రోజుల పని కల్పించాలని ఫీల్డు అసిస్టెంట్లకు సూచించారు. కొలతల ప్రకారం పని చేస్తే ప్రతి రోజు రూ.307 కూలీ



వస్తుందని కార్మికులకు తెలిపారు.అనంతరం గ్రామ పంచాయతీలలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి, లబ్ధిదారులతో సమావేశమై పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ సతీష్ ,పంచాయతీ కార్యదర్శులు చంద్రశేఖర్,రాకేష్, చంద్రయ్య,సీనియర్ మేటి శ్రీశైలం మరియు ఉపాధి హామీ కూలీల పాల్గొన్నారు.